# కథాసరిత్సాగరము

మహామహోపాధ్యాయ

వేదము వేంకటరాయశాస్త్రి

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కథాపీఠ మను ప్రథమలంబకము | 7 |
| 2. | కథాముఖ లంబకము | 55 |
| 3. | లావాణకలంబకము | 102 |
| 4. | నరవాహనదత్త జనన లంబకము | 165 |
| 5. | చతుర్దారికాలంబకము | 190 |
| 6. | మదనమంచుకా లంబకము | 228 |
| 7. | రత్నప్రభాలంబకము | 300 |
| 8. | సూర్యప్రభలంబకము | 373 |
| 9. | అలంకారవతీలంబకము | 449 |
| 10. | శక్తియశోలంబకము | 529 |
| 11. | వేలాలంబకము | 637 |
| 12. | శశాంకవతీలంబకము | 643 |
| 13. | మదిరావతీలంబకము | 886 |
| 14. | పంచలంబకము | 898 |
| 15. | మహాభిషేకలంబకము | 932 |
| 16. | సురతమంజరీలంబకము | 948 |
| 17. | పద్మావతీ లంబకము | 970 |
| 18. | విషమశీల లంబకము | 1020 |

శ్రీ

# కథాసరిత్సాగరము

## కథాపీఠ మను ప్రథమలంబకము

### ౧వ తరంగము

శా. శ్రీలం బల్కెడు మా కపూర్వ విజయశ్రీలోలదృక్పాత్రమై
నాళీకాస్త్రుఁడు శూలి వంప గిరికన్యాదృష్టి పాశంబుచే
హేలం గట్టెనొ నాఁగ భృంగహరినీలేందీవరశ్యామ మై
లీలం గ్రాలెడు శంభుకంఠము కృపాళిందాంతరంగంబుతోన్.

శా. తారాసంఘము నెల్లఁ దొండమున సంధ్యాతాండవోత్సాహమం
దారూఢిన్ వెస నూఢ్చి త్రోసి కడు నవ్యం బైనసత్తారకా
వారంబున్ నిజశీత్కృతి ప్రభవ మౌ వార్బిందుపూరంబుచే
నీరంధ్రంబుగఁ జేయువేలు పొసఁగున్ నిర్విఘ్నముం బ్రీతితోన్.

క. సకలపదార్థాభిద్యో । తకదీపిక శారదాంబఁ దత్పరత భజిం
చి కడంగితిని బృహత్కథ । నకలంకత సంగ్రహముగ నభివర్ణింపన్.

కథాక్రమ వివరణము

ఇందు మొదటి లంబకము కథాపీఠము, రెండవది కథాముఖము, మూఁడవది లావాణకము, నాలవది నరవాహనదత్త జననలంబకము, తరువాతిది చతుర్దారికాఖ్యము, ఆఱవది మదనమఞ్చుక, పిమ్మట రత్న ప్రభాలంబకము, ఎనిమిదవది సూర్య ప్రభ, తొమ్మిదవది అలంకారవతి, పిమ్మట శక్తియశ, పదునొకొండవది బేతాళలంబకము, తరువాత శశాంకవతీలంబకము, అటుతరువాత మదిరావతీలంబకము, పిమ్మట పంచలంబకము, దానివెంట మహాభిషేకలంబకము, పదునాఱవది సురతమంజరి, తరువాత పద్మావతి, పదునెనిమిదవది విషమశీలలంబకము.

## సంస్కృత గ్రంథ ప్రణేతృ ప్రతిజ్ఞ

ఇది మూలమయిన పైశాచీ బృహత్కథకు సరిగా నుండును. ఇంచుకయినను అతిక్రమింపదు. అందలి గ్రంథవిస్తరము ఇందు సంక్షిప్తమగుటయు భాషయు మాత్రమే భేదము. ఇందు శక్తికొలది ఔచిత్యము పోషింపఁబడియున్నది, కథారసమునకు భంగము లేకుండ కావ్యరసము చూపఁబడి యున్నది. ఈ నా ప్రయత్నము నానాకథాజాలమును సులువుగా స్మరణలో నుంచుకొనుటకే గాని పాండిత్యకీర్తికిఁ గాదు.

## కథావతరణము

కలదు గదా కిన్నర గంధర్వ విద్యాధర నివాసము పర్వతచక్రవర్తి హిమవత్పర్వతము. ఆ హిమవంతుని మహిమను వేఱె పొగడవలయునా? అన్ని పర్వతము లుండఁగా త్రిలోకమాత అతనికే కూఁతురై పుట్టుటచేతనే తెలియలేదా? ఆ హిమాలయము యొక్క యుత్తరశిఖరమయిన మహాగిరికి కైలాస మనిపేరు. అది అనేక సహస్రయోజనములు ఆక్రమించి యుండును. 'సముద్రమును మథించినదయ్యును మందరగిరి అమృతముచేత నైనను తెల్లఁబడదాయెను. నేను అప్రయత్నముగానే తెల్లఁగా నున్నాను.' అని నవ్వుచున్నదో యనునట్లు ఆ కైలాసము తెల్లనివెలుఁగుచే దేదీప్యమానముగా నుండును. అందు సిద్ధ విద్యాధరాదులును ప్రమథ గణములును కొలుచుచుండ చరాచర గురువు పరమేశ్వరుఁడు పార్వతితోఁగూడ నివసించుచుండును. ఏదేవుని యెఱ్ఱనిజటాజూట మందు బాలచంద్రుఁడు సంధ్యారాగముచే వెలుంగు నుదయగిరి శృంగమందలి విహారసుఖమును పొందుచున్నాఁడో, ఏభగవంతుఁడు అంధకాసురుని హృదయమును త్రిశూలమున గ్రుచ్చి ముల్లోకముల హృదయశూలమును వెలువరించినాఁడో, ఏదేవదేవునికి దండప్రణామములు చేసి సురాసురులు తమ చూడామణులయందు అతని పాదనఖ ప్రతిబింబములచేత ప్రసాద ప్రాప్తార్ధ చంద్రుల చేతనుంబలె ప్రకాశించుచుందురో, ఆపరమేశ్వరునిం బ్రాణనాయిక పార్వతి ఒకనాఁడు ఏకాంతంబున చనువు మెఱసి సన్నుతులచేత సంతోషపెట్టెను. ఆపొగడ్తలకు సంతసిల్లి చంద్రశేఖరుఁడు ఆమెను తొడమీఁద కూర్చుండఁ బెట్టుకొని, 'ప్రాణనాయికా! నీ కేమిప్రియము చేయుదును' అని యడిగెను. అంతట గిరిపుత్రి 'నా యేలినవాఁడా, దేవా, నాకు ప్రసన్నుఁడవేని మనోహరమయిన యొక యపూర్వకథను చెప్పుము.' అనెను. అందునకు పరమేశ్వరుఁడు, 'ఓసఖీ, లోకములో భూతము గాని వర్తమానము గాని భవిష్యత్తు గాని నీ వెఱుఁగనిదే మున్నది? అనెను. అట్లన్నను పార్వతి ఆయనను నిర్బంధ పెట్టెను. మానినులచిత్తము ప్రియానురాగ పరీక్షా పరాయణము గదా? అంతట ఆమెను రంజింప వేఁడి మహేశ్వరుఁడు తన మహిమను ప్రకటించునదైన యీ చిన్ని కథను వక్కాణించెను.

## పరమేశ్వరుఁడు పార్వతికి జ్వాలాలింగ కథను చెప్పుట

పూర్వము నన్ను చూచుటకు బ్రహ్మయు నారాయణుఁడును భూలోకంబునం గ్రుమ్మరుచు హిమవంతుని పాదమూలముచేరి అక్కడ ఎదుట గొప్పజ్వాలాలింగమును గాంచిరి. అంతట దానియంతము కనుంగొనుటకు ఒకఁడు పైకిని మఱియొకఁడు క్రిందికిని పోయిరి. ఎంత దూరము పోయినను తుదగానలేక మరలి వచ్చి నన్ను తపస్సులచేత మెప్పించిరి. నేనును ప్రత్యక్షమై వర మడుగు మంటిని. నన్ను తన కుమారుఁడను గమ్మని బ్రహ్మయడిగెను. అట్లు తానే సర్వోత్కృష్టుఁడు గావలయునని కోరిన దోషము చేత అతఁడు లోకములో అపూజ్యుఁడైనాఁడు. నారాయణుఁడు 'స్వామీ! నీకు శుశ్రూష చేయుచుందును గాక' అని వర మడిగెను. అందుచే నతఁడు నాయర్ధశరీరమై నీవుగా జన్మించినాఁడు; నీవే ఆనారాయణుఁడవు. శక్తివి; నేనే శక్తిమంతుఁడను. మఱియు నీవు పూర్వజన్మమందుఁ గూడ నా భార్యవు.

ఇట్లు చెప్పఁగానే శంకరుని 'నీకు నే నెట్లు జన్మాంతరమందు భార్య నైతినో చెప్పుమ'ని పార్వతి యడిగెను. అంతనాతం డిట్లు చెప్పెను.

## దక్షయజ్ఞకథ

దేవీ! పూర్వము దక్షప్రజాపతికి నీవును ఇంక పలువురును కొమారితలు పుట్టితిరి. అతఁడు నిన్ను నాకును తక్కిన వారిని ధర్మాదులకును ఇచ్చెను. ఒకానొకప్పుడు అతఁడు యజ్ఞము చేయుచు అందులకు కడమయల్లుంద్ర నందఱను పిలిచి నన్ను మాత్రము పిలువఁడాయెను. నీవు తండ్రిని 'నాయనా! నాభర్తను మాత్రము పిలువ లేదేమి?' అని యడుగఁగా, 'నీ భర్త పుసుకలపేరు ధరించువాఁడు, యజ్ఞములోని కెట్లు పిలుతును?' అని దక్షుండు ఉత్తర మిచ్చెను. ప్రేయసీ! ఆ మాటలు నీ చెవులకు సూదులై సోఁక, నీవు 'ఇతఁడు పాపాత్ముఁడు, వీనివలనఁ బుట్టిన యీ దేహము నా కేల?' అని కోపముచేత ఆదేహమును వదలి వైచితివి, జ్ఞప్తి తెచ్చుకొనుమా, పిమ్మట హిమాలయమునకు నేను తపస్సుకై వచ్చితిని; మీతండ్రియు అతిథి నైన నాకు శుశ్రూషకై నిన్ను నియమించెను గదా! తారకాసురుని సంహరింపఁగల యొకపుత్త్రుఁడు నాకు కలుగుటకై మన్మథుఁడు దేవతల ప్రేరణమీఁద అచ్చటికి వచ్చిన వాఁడు, నీవు నా చెంత నుండఁగా, సమయ మని నాపై బాణమేసి, నామూఁడవ చూపుచే భస్మ మాయెను. పిమ్మట నత్యుగ్ర తపస్సుచేత నన్ను నీవు దక్కఁగొంటివి. ఈప్రకారము నాకు నీవు పూర్వమందును భార్యవు. మఱి యేమి చెప్పుదును నీకు?